క్లుప్తంగా

నిరుపయోగంగా బస్‌షెల్టర్



భట్టిప్రోలు: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లోని బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. ఎదురుగా ఆటోలు, రిక్షాలు నిలపడంతో షెల్టర్ ఉన్న సంగతే తెలియడం లేదు. 1983లో రోవరు పులికొండ వెంకట సాయి జ్ఞాపకార్థం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రయాణికుల విశ్రాంతి భవనంను నిర్మించారు. నేడు అది నిరుపయోగంగా మారింది. భిక్షగాళ్లకు ఆవాసంగా మారింది. ఈ షెల్టర్‌ను నిర్మించిన దాతలు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

బధిరుల పాఠశాలలో అన్నదానం



బాపట్ల: బధిరుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని రాగాల చిన్న కోటేశ్వరరావు పేర్కొన్నారు. వెదుళ్లపల్లిలోని బదిరుల పాఠశాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి విద్యార్థులకు మంచి పిండి వంటలతో కూడిన భోజనాన్ని ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ప్రభుత్వ పరమైన సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వినీత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో సత్తా చాటిన బాపట్ల విద్యార్థులు



బాపట్ల: అబాకస్ పోటీల్లో బాపట్ల విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల ఢిల్లీలోని యూనివర్సిటీలో జరిగిన ప్రపంచ స్థాయి అబాకస్ పోటీల్లో బాపట్ల, చీరాల యూసిమాస్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు బుధవారం వారిని అభినందించారు. ఆయా విభాగంలో 3వ స్థానంలో నిలిచి ట్రోఫీలు సాధించడం ఎంతో విశేషమన్నారు. చిన్నారులను అభినందించి ఆశీర్వదించారు. యూసిమాస్ బాపట్ల డైరెక్టర్లు స్మైలీ, బొనిగల రాజేంద్రప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్, మదిరి భూషణ్ రావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పూడిపోతున్న పంట కాల్వ
పట్టించుకునే వారే కరువు



తెనాలిరూరల్: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నీరు రాకపోవడంతో రైతన్నలు, పంట కాల్వ మురుగమయంగా మారడంతో దోమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నీటిపారుదల, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయలోపానికి పాటి కాల్వ నిదర్శనంగా ఉంది. పశ్చిమ డెల్టాకు సాగు నీరందించే ప్రధాన కాల్వల్లో ఒకటైన తూర్పుకాల్వ నుంచి మండలంలోని కొత్తపాలెం వరకు వెళ్లే ఈ సాగునీటి కాల్వ ఐతానగర్ గుండా ప్రయాణిస్తుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురుగుమయంగా మారింది దీని గురించి అటు నీటిపారుదల శాఖ అధికారులు కానీ ఇటు పురపాలక అధికారులు కానీ ఎవరూ పట్టించుకోవట్లేదు. సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. పట్టణ శివారు ప్రాంతాల్లోని పొలాలతో పాటు నేలపాడు, బుర్రిపాలెం గ్రామాల పరిధిలో ఉన్న పొలాలకు ఈ కాల్వ ద్వారా సాగునీరు అందుతుంది. పట్టణ పరిధిలో ఉందంటూ నీటిపారుదల శాఖ, సాగునీటి కాల్వ అంటూ పురపాలక సిబ్బంది దీని గురించి పట్టించుకోవడం మానేశారు. ఐతానగర్ పరిధిలో మురుగునీరంతా ఈ కాల్వలోకే వదులుతున్నారు. చెత్తచెదారాన్ని కాల్వలోనే పడేస్తున్నారు. ఫలితంగా కాల్వ మురుగుమయంగా మారి దోమలకు ఆలవాలంగా తయారయింది. దీని కారణంగా ఐతానగర్‌లో దోమలు విపరీతంగా ఉన్నాయి. ఇళ్లలో ఉండలేకపోతున్నామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ వెంబడి ఉన్న ఇళ్ల నుంచి చెత్త, ప్లాస్టిక్ కవర్లు, పాడి ఉన్న ఇళ్ల నుంచి పెంట కుప్పలను ఈ కాల్వలో పడేస్తుండడంతో కాల్వలో నీటి పారుదలకు వీలు లేకుండా పూడుకుపోతోంది. అయినా పట్టించుకునే వారే లేకుండాపోయారు. అయితే ప్రజల్లోనూ మార్పు రావాలని అధికారులు అంటున్నారు. సాగునీటి కాల్వలో చెత్త వేయకుండా ఉండే బాధ్యత ప్రజలదేనంటున్నారు.

ప్రేమ, కరుణ, దయ ఏసుక్రీస్తు మార్గాలు

క్రిస్మస్ పర్వదిన వేడుకలను క్రైస్తవ సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి భక్తి గీతాలాపనలు చేస్తూ క్రిస్మస్ ట్రీను ఊరేగించి క్రీస్తుకు భూమిపైకి ఆహ్వానం పలికారు. అన్ని చర్చిలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసి, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. క్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక, దేవదూతలు, క్రిస్మస్ తాతల బొమ్మలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దేవుని యందు విశ్వాసం ఉంచాలని, ఏసు ప్రభు మార్గాలు ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలని ఫాదర్లు దైవ సందేశాన్ని అందించారు. పాపుల పాపాలను తొలగించేందుకే అవనిపై అడుగుపెట్టి తన రక్తాన్ని చిందించి ఏసుక్రీస్తు పాప ప్రక్షాళన చేశారని వివరించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రేపల్లె రూరల్: ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్(ఐఆర్ఈఎఫ్)చర్చిలో బుధవారం బిషప్ డాక్టర్ ఇమ్మానియేలు రెబ్బా, జాన్ రెబ్బాలు క్రిస్మస్ సందేశాన్ని అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇసుకపల్లిలోని ఏఈఎల్‌సీ టౌన్ లూథరన్ చర్చి, 24 వార్డులోని జీసెస్ బ్లెసింగ్ చర్చి, సెయింట్ మేరీస్ చర్చి, మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలలో విశ్వాసులు ఏసుప్రభువును ఆరాధించారు.

చెరుకుపల్లి: మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ పండుగ వేడుకలు క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. గుంటూరు తూర్పు సినడ్ బిషప్ రెవరెండ్ కూరాకుల రత్నమోహన్ గుళ్లపల్లి ఏఈఎల్‌సీ చర్చిలో క్రీస్తు సందేశం అందించారు. ఏసుక్రీస్తు ప్రేమ స్వరూపి అని, లోక రక్షకుడు బోధించిన ప్రేమ, దయ, కరుణను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. అన్ని చర్చిల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొల్లూరు : క్రిస్మస్ పర్వదినాన్ని మండలంలో వైభవంగా నిర్వహించారు. కొల్లూరు లూథరన్ చర్చి, తెలుగు బాప్టిస్టు చర్చి, రక్షణ సైన్యం చర్చిలతో పాటు గ్రామాల్లోని చర్చిలు క్రైస్తవులతో కిటకిటలాడాయి.

నగరం: క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరం, పూడివాడ, బొరమాదిగపల్లి, ధూళిపూడి, ఎట్టివారిమాలపల్లి, పెదమట్ల పూడి, పెదపల్లి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలకు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కర్లపాలెం: క్రిస్మస్ సందర్భంగా బుధవారం చర్చిల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు క్రిస్మస్ ప్రాముఖ్యతను, క్రీస్తు సందేశాన్ని ప్రజలకు వివరించారు. విశ్వాసకులకు ఫలహారాలను అందజేశారు. పిట్టలవానిపాలెం మండలంలోనూ క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



ఏఈఎల్‌సీ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

భట్టిప్రోలు: క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం మండలంలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థన మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునే కొవ్వొత్తులతో ప్రధాన వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. దైవ సేవకులు క్రిస్మస్ సందేశం అందించారు. నవంబర్ 25 నుంచి ఉపవాస దీక్షలు చేపట్టిన క్రైస్తవులు పండగ నాడు దీక్షలు విరమించారు. అద్దేపల్లి ఏఈఎల్‌సీ చర్చిలో రెవరెండ్ మద్దిరాల ఆనందరావు, ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం, రైలుపేటలో గురు మండల అధ్యక్షుడు రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ, బేతేలు ప్రార్థన మందిరంలో పాస్టర్ కె.అబ్రహం దైవ సందేశం అందించారు. క్రీస్తు రక్షకుని దేవాలయంలో బాల ఏసు అలంకరణ ఆకట్టుకుంది. విచారణ గురువు రవికుమార్ రెడ్డి, ధ్యాన కేంద్రం డైరెక్టర్, సుపీరియర్ మార్టిన్, సహాయక గురువు బిబిన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానిక జ్యోతి నివాస్‌లో బాల ఏసు పశువుల పాకను సుందరంగా తీర్చిదిద్దారు. సుపిరియర్ ఆఫ్ టూనీ సిస్టర్ లైసా, సిస్టర్ ఎస్తేరు మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రార్థనలో భాగంగా బాల ఏసుకు దైవ దూతలు నమస్కరిస్తూ ఉన్న దృశ్యం విశేషంగా ఆకర్షించింది. ఓలేరులోని పునీత శౌరీవారి దేవాలయంలో విచారణ గురువు సేవి పుదుచ్చెరి, సహాయక గురువు బెన్నీ కారుకుళం, సిస్టర్స్ బాల ఏసును సుందరంగా తీర్చిదిద్దారు.

చర్చిలకు స్వీట్లు, అరటి గెలలు



రేపల్లె రూరల్: పేటేరు పంచాయతీలోని 11 చర్చిలకు సర్పంచ్ కనపర్తి వసుమతి, కుటుంబ సభ్యులు ప్రసాదాలను బుధవారం అందజేశారు. అరటి గెలలు, స్వీటు బాక్స్‌లను పంపిణీ చేసి, వైఎస్సార్ సీపీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు పాల్గొన్నారు.



భట్టిప్రోలు: పశువుల పాకలో బాల ఏసు

సేవ ప్రభువు మార్గం



కష్టాల్లో ఉన్న వారిని అక్కున చేర్చుకుని, ఆ కష్టాలను తొలగించే వారి చెంత ఆ ప్రభువు తోడై ఉంటారు. సాటి జీవులపట్ల ప్రేమ, నిస్సహాయులపై కరుణ, ఆకాశమంతటి సహనం, శత్రువులపై కూడా క్షమాగుణం కలిగి ఉండటం.. జీసెస్ తన జీవితం ద్వారా మానవులకు ఇచ్చిన మహోన్నత సందేశం.

– డాక్టర్ ఇమ్మానియేలు రెబ్బా, బిషప్, రేపల్లె రూరల్

క్రీస్తు బోధనలతో సన్మార్గం

మానవాళిని క్రీస్తు బోధనలు సన్మార్గంలో నడిపిస్తాయి. ఏసుక్రీస్తు ప్రేమ స్వరూపి. లోక రక్షకుడు బోధించిన ప్రేమ, దయ, కరుణను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి.

– కూరాకుల రత్నమోహన్, బిషప్ రెవరెండ్ గుంటూరు తూర్పు సినడ్



చెరుకుపల్లి: పుర వీధుల్లో చిన్నారుల ప్రదర్శనలు



కొల్లూరు: లూథరన్ చర్చిలో భక్తులకు క్రీస్తు బోధనలు



బొరమాదిగ పల్లిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్



భట్టిప్రోలు ఏఈఎల్‌సీ చర్చి ప్రార్థనలో దైవ జనులు

సాహితీ చరిత్రలో లక్ష్మీకాంతమ్మ స్థానం సుస్థిరం

బాపట్ల: ఆంధ్ర కవయిత్రుల చరిత్ర గ్రంథస్తం చేసి డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. లక్ష్మీకాంతమ్మ జయంతి సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంస్కృతాంధ్ర భాషల్లో దిట్టైన లక్ష్మీకాంతమ్మ మొత్తం 18 పుస్తకాలు రచించారని గుర్తుచేసుకున్నారు. కేరళ ప్రభుత్వం ప్రచురించిన ప్రపంచ సాహిత్య చరిత్రలో ఆమె రచనలకు స్థానం దక్కిందని తెలిపారు. స్వాతంత్రోద్యమంలోనూ, ఆంధ్రోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ పురస్కారాన్ని అందుకున్నారని తెలిపారు. ఆమె రచనలపై పరిశోధనలు చేసి పలువురు పీహెచ్‌డీ పట్టాలు పొందారని పేర్కొన్నారు. న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు వీరాస్వామి, రాజమోహన్ రావు, నరసింహారావు, ఇబ్రహీం, అశోక్, గోపి, నాగసాయి, ఆదినారాయణ పాల్గొన్నారు.



లక్ష్మీకాంతమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పల్లెకోన రైల్వే స్టేషన్‌లో సంబరాలు

పల్లెకోన(భట్టిప్రోలు): సికింద్రాబాద్ నుంచి రేపల్లె వెళ్లే పాస్ట్ పాసింజర్ రైలు ఐదేళ్లుగా మండలంలోని పల్లెకోన స్టేషన్‌లో ఆగడం లేదు. దీంతో పల్లెకోన, ఆళ్లమూడి, కారుమూరు, కోనేటిపురం, సూరేపల్లి, పడమటివారిపాలెం, రేపల్లె నియోజకవర్గ పరిధిలోని ధూళిపూడి తదితర ప్రాంతాల ప్రయాణికులు భట్టిప్రోలు లేదా రేపల్లెలలో దిగి గమ్య స్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రిళ్లు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైల్వే శాఖ అధికారులకు ఎన్నో మార్లు మొరపెట్టుకోవంతో రైలును ప్రస్తుతం పల్లెకోన స్టేషన్‌లో ఆపుతున్నారు. దీంతో ఆ గ్రామస్తులు స్వీట్లు పంచి, బాణ సంచా కాల్చారు. రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయన ప్రసాదు, మాజీ ఎంపీపీ వేజళ్ల సతీష్, పల్లెకోన మాజీ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావు, రాజులపాటి వెంకటేశ్వరరావు, నాయకులు అంక సుబ్బారావు, వేజళ్ల శివ రామ ప్రసాద్, సోమశేఖర్, చిలకా నాంచారయ్య, పురమా నాగరాజు, రావూరి వరప్రసాదు పాల్గొన్నారు.



స్టేషన్ వద్ద బాణ సంచా కాలుస్తున్న గ్రామస్తులు

దాతల సహకారంతో ఆలయ ప్రహరీ నిర్మాణం

స్పష్టం చేసిన గంగమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు: దాతల సహకారంతో ఆలయ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామని గంగమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక గంగమ్మ తల్లి ఆలయంలో గుడి కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడులో ఆలయాన్ని రెండేళ్లుగా గ్రామస్తుల సహకారంతో దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం చేస్తున్నామని, కానీ కొందరు గిట్టని వ్యక్తులు తమపై అసత్య ఆరోపణలతో అధికారులకు పిటిషన్లు పెడుతున్నారని తెలిపారు. ఇది కచ్చితంగా భక్తుల మనోభావాలను కించపరచడమేనన్నారు. అధికారులు స్పందించి నిజ నిర్ధారణ చేసి నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులను, భక్తులను, గ్రామస్తులను తప్పుదారి పట్టించడం సరికాదని చెప్పారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు జెట్టి పరమేశ్వరరావు, రాయల వెంకటరత్నం, బాపతు సత్యనారాయణ రెడ్డి, చిన్నం శంకర్, చాంగటి శ్రీను, కమ్మా శివప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

క్యారమ్స్‌లో చిరుమామిళ్ల విద్యార్థిని సత్తా

అద్భుత ఆటతీరుతో రజతం సాధించిన హిమశ్రీ

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని సత్తెనపల్లి హిమశ్రీ రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో అండర్14 విభాగంలో రజత పతకం సాధించింది. ఈ నెల 22, 23 తేదిల్లో ప్రకాశం జిల్లా పాకాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. అద్భుతమైన ఆటతీరు కనబరిచిన హిమశ్రీ రజత పతకాన్ని కై వసం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యాదాత నడికట్టు రామిరెడ్డి, హెచ్‌ఎం సుందరరావు, పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆదర్శ స్వాతంత్ర్యయోధురాలు కల్లూరి తులశమ్మ

114వ జయంతి రోజున కాంస్య విగ్రహానికి ఘన నివాళి

తెనాలి: రూరల్ మండల గ్రామం పెదరావూరుకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్యయోధురాలు కల్లూరి తులశమ్మ 114వ జయంతిని బుధవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నున్న తులశమ్మ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గ్రామంలోని పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట కాలంలో గాంధీజీ బ్రహ్మచర్యం, సత్యపాలన వంటి సూత్రాలకు ఆకర్షితురాలైన తులశమ్మ స్వరాజ్య పోరాటానికి అంకితమైనట్టు గుర్తుచేశారు. అప్పటికే వివాహితగా ఉన్నప్పటికీ భర్తను ఒప్పించి, ఆయనకు మళ్లీ పెళ్లి చేసి, తాను వివాహ బంధనాల నుంచి విముక్తురాలైనట్టు చెప్పారు. బంగారు నగలను పరిత్యజించినట్టు తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుజీవితం అనుభవించిన త్యాగశీలిగా చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఖద్దరు వస్త్రాలను విక్రయిస్తూ, వచ్చిన కమీషనుతోనే జీవించారనీ, గాంధీజీ మార్గం నుంచి ఇసుమంతైనా పక్కకు రాని ధీరవనితగా పేర్కొన్నారు. ఆ మహనీయురాలు పెదరావూరు గ్రామస్తురాలు కావడం గర్వకారణమన్నారు. చివరిరోజుల్లో తులశమ్మ ఆలనా పాలనా చూసిన శాఖమూరి తిమ్మా నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొన్నారు. తులశమ్మతో తమ కుటుంబానికి గల అనుబంధాన్ని తిమ్మానాయుడు వివరించారు. గ్రామ ప్రముఖులు పాలడుగు సురేంద్ర. కొడాలి పూర్ణచంద్రరావు, రాంబాబు, తులసమ్మ బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

14 నుంచి శ్రీరామనామ కోటి మహోత్సవాలు

భట్టిప్రోలు: అద్దేపల్లి రామనామ క్షేత్రంలో జనవరి 14 నుంచి 17వ తేదీ వరకు 74వ శ్రీరామ నామ కోటి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామూహిక పూజలు, సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, నాలుగు రోజుల పాటు భగవద్గీత పారాయణం, భక్తి జ్ఞానం పెంపొందించే హరి కథలు, ఉపన్యాసాలు, సంకీర్తనలు ఉంటాయని పేర్కొన్నారు.

రేపు ప్రజా వేదిక

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు గ్రామ స్థాయిలో జరిగిన సామాజిక తనిఖీల వివరాలను ప్రజా వేదికలో ప్రజలకు, అధికారులకు వివరించడం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కర్లపాలెం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి శనివారం వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్ల లోపు చిన్నారులందరికీ ఆధార్ కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. గురువారం యాజలి, దుండివారిపాలెం, బోలాయపాలెం, నాగరాజుపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం, నర్రావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో, 27న బుద్ధాం, దమ్మనవారిపాలెం, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కర్లపాలెం చింతాయపాలెం, పేరలి సమ్మెటవారిపాలెంలో, 28న ఏట్రవారిపాలెం, నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం, పాతనందాయపాలెం, పెదగొల్లపాలెం, పేరలిపాడు, తుమ్మలపల్లి, అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో వివరించారు.

తెలుగు వెలుగు తుమ్మల

బాపట్ల: సమాజంలో జరుగుతున్న దోపిడీని, అన్యాయాలను, అక్రమాలను అభ్యుదయ కవుల కంటే ఎంతో ముందుగానే తన కవిత్వం ద్వారా బట్ట బయలు చేశారు తుమ్మల సీతారామమూర్తి. ఆధునిక కవుల్లో అగ్రగణ్యుడు, అభినవ తిక్కన బిరుదాంకితుడు తుమ్మల సీతారామమూర్తి సాహితీ రంగానికి ఎనలేని సేవలు అందించారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో తుమ్మల జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 1924 కావూరులో ప్రారంభించిన తిలక్ జాతీయ విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా ఆయన చేరారు. 1930 నుంచి తెలుగు పండితులుగా పనిచేశారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో స్థిర నివాసం ఏర్పరుచుకుని బాపట్ల బోర్డు హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1928 లో తుమ్మల ఆత్మార్పణము అనే కావ్యాన్ని రచించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు తన రాష్ట్ర గానం ద్వారా ఎలుగెత్తి చాటారు. 1950లో గాంధీజీ ఆత్మ కథకు పద్య అనువాదమైన ఆత్మకథను రచించారు. భారతీయుడిగా మహాత్ముడి ఆత్మకథను లాల్ బహదూర్ శాస్త్రికి అంకితమిచ్చారు. మహాత్మ కథ కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు . తుమ్మల తెలుగు భాషకు చేసిన సేవలకు గుర్తుగా తనకు తాను తెనుగు లెంక గా పిలుచుకున్నారు. ఈ అరుదైన సాంప్రదాయ బద్ధుడైన కవి ఎన్నో రచనలు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేట్ డిగ్రీని తుమ్మలకు అందజేసింది. బాపట్ల మండలం అప్పికట్లలో తుమ్మల విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలుగు సాహితీ రంగానికి చేసిన సేవలను ప్రతి ఏటా స్మరించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన జయంతి వేడుకలను అప్పికట్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు.



తుమ్మల సీతారామమూర్తి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

చెరుకుపల్లి: కోడి పందేలు వేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. వివరాల మేరకు.. స్థానిక భాస్కర్ థియటర్ వెనుక బుధవారం కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో దాడి చేశారు. ఇద్దరిని, కోడి పుంజును అదపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వివరాలు తెలిస్తే..94409 00874 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.